క్లుప్తంగా

బస్తీ దవాఖానా వైద్యాధికారిగా వంశీకృష్ణ



నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రామాపురంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా వైద్యాధికారిగా బండి వంశీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వంశీకృష్ణ మొదటి పోస్టింగ్ ఇక్కడే. అయితే బస్తీ దవాఖానా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో ఆయన ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు.

ఇంటర్ విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో హుజూర్‌నగర్‌కు చెందిన ధూళిపాల లోకేశ్ 470 మార్కులకు 463 మార్కులు సాధించాడు. దీంతో జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం హుజూర్‌నగర్‌లో అతనిని శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు, సమాఖ్య నాయకురాళ్లు పి.పిచ్చమ్మ, ఏ.లక్ష్మి, ఉమ, విజయ, సుశీల, అంబిక, కేతమ్మ, సుబ్బమ్మ, సుజాత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి సాయం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి నారాయణపురం గ్రామ సర్పంచ్ అట్లూరి నాగేందర్‌రెడ్డి 100 సిమెంట్ కట్టలను శుక్రవారం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

హుజూర్‌నగర్ : మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను ఉద్దేశించి యాదవుల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పి.ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న సర్పంచ్ సలీమారంజాన్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరగడ్డ గ్రామానికి చెందిన అమరబోయిన లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శుక్రవారం లింగయ్య దశదిన కర్మ సందర్భంగా బాధిత కుటుంబానికి సర్పంచ్ షేక్ సలీమారంజాన్ 50 కేజీల బియ్యం అందజేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు షేక్ అలీపాషా, గండు సైదులు, ఆవుల వెంకటయ్య, సైదులు, ఉపేందర్, సైదులు, నరసింహారావు, వినోద్, శేఖర్, బాధిత కటుంబసభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి



విద్యుదాఘాతంతో కాలిన ఆవు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యుదాఘాతంతో నాలుగు పశువులు, ఒక కుక్క మృతి చెందాయి. ఈ సంఘటన చింతలపాలెం మండలం కొత్తగూడెంతండాలో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం తండా శివారులోని పొలాల్లో గల బాలిరెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ స్తంభం మీద పడి ఒక గేదే మృతి చెందింది. అక్కడ కిందపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మరొక గేదె, రెండు ఆవులు, ఒక కుక్క మృతి చెందాయి. విద్యుత్ షాక్ తీవ్రతకు ఒక ఆవు వీపు భాగం కాలిపోయింది. మృతి చెందిన ఆవులు కొత్తగూడెం తండాకు చెందిన బుక్యా రామారావు, లావుడ్యా కోటేశ్వరరావుకు చెందినవిగా గుర్తించారు. మిగతా వాటి వివరాలు తెలియలేదు. సంఘటన జరిగి నాలుగు రోజులై ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

సుగ్రీవ మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : పట్టణంలోని చింతల బజార్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగేళ్ల సుగ్రీవ (60) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరావు, కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, ఎ.సతీష్, నాయకులు యడ్ల విజయ్, ప్రదీప్, నాగరాజు, సాయిరాం, రాము, నర్సింహారావు మజీద్‌లు సంతాపం తెలిపారు.

'జీఎమ్మార్' జాప్యం.. ప్రజలకు శాపం

- మొదలుపెట్టి మధ్యలోనే నిలిపివేసిన డ్రెయినేజీ పూడికతీత పనులు
- మూతలు తొలగించడంతో ప్రమాదాలు జరుగుతాయని స్థానికుల ఆందోళన
- త్వరితగతిన పూర్తిచేయాలని వేడుకోలు



మునగాలలో పూడికతీత కోసం డ్రెయినేజీపై మూతలు తొలగించిన సిబ్బంది

మునగాల : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో 2013లో ఫ్లెటైవర్ బ్రిడ్జికి ఇరుపైపులా జీఎమ్మార్ సంస్థ డ్రెయినేజీలు నిర్మించింది. అయితే నాటి నుంచి నేటివరకు డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారంతో డ్రెయినేజీ నిండిపోయి మురుగునీరు సర్వీస్ రోడ్డు పైకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించాలని గ్రామపంచాయతీ పాలకవర్గం పలుమార్లు సదరు జీఎమ్మార్ సంస్థకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. దీంతో పలుమార్లు సాక్షి దినపత్రికలో 'డ్రెయినేజీ నిర్వహణ అస్తవ్యస్తం' అనే శీర్షికతో కథనం ప్రచురించడంతో ఎట్టకేలకు స్థానిక సీఐ, గ్రామ సర్పంచ్, పలువురు గ్రామపెద్దలు జోక్యం చేసుకొని జీఎమ్మార్ సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. చివరకు స్పందించిన జీఎమ్మార్ సంస్థ గత నెల 25న డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించేందుకు సిద్ధమైంది. డ్రెయినేజీలపై ఉన్న మూతలను మూడు రోజుల పాటు జీఎమ్మార్ సంస్థ సిబ్బంది తొలగించారు. మరో మూడు రోజుల తర్వాత డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎత్తి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. కానీ అక్కడక్కడ తొలగించి కొన్ని ప్రాంతాలలో తొలగించకుండా వదిలేశారు. ఇదిలా ఉండగా మూడు రోజుల పాటు పనులు చేపట్టిన జీఎమ్మార్ సంస్థ పనులను నిలిపివేసింది. దీంతో డ్రెయినేజీలపై ఉన్న మూతలను అడ్డదిడ్డంగా పడవేశారు. మూతలు లేకపోవడంతో డ్రెయినేజీలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల రెండు గేదెలు డ్రెయినేజీలలో పడి గాయాలపాలయ్యాయి. రాత్రివేళ ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పనులు నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్లకు ఇరువైపుల సుమారు 1.5 కి.మీ మేర ఉన్న డ్రెయినేజీలపై అక్కడక్కడ మూతలు తీసీ వదలివేయడం వల్ల వ్యాపారస్తులకు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. తక్షణమే యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు పూర్తిచేసి డ్రెయినేజీలపై మూతలు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలి



మునగాల గ్రామ పంచాయతీ పరిధిలో సర్వీసు రోడ్డు వెంట నిర్మించిన డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం, పూడికతీత పనులను జీఎమ్మార్ సంస్థ సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలి. డ్రెయినేజీపై మూతలు తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. పూర్తిస్థాయిలో చెత్తచెదారం తొలగించి యుద్ధప్రాతిపదికన మూతలు వేయాలి.

– చింతకాయల ఉపేందర్, సర్పంచ్, మునగాల

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు వెంట ఉన్న డ్రైనేజీలలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు జీఎమ్మార్ సిబ్బంది డ్రెయినేజీపై మూతలు తొలగించి వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత వారంరోజులుగా దుకాణం మూసివేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

– తడకమళ్ల శ్రీనివాసాచారి, మునగాల

వారం రోజుల్లో పూర్తిచేస్తాం

మునగాలలో చేపట్టిన డ్రెయినేజీ పూడికతీత పనులను వారం రోజుల్లో పూర్తిచేస్తాం. యాంత్రిక లోపం కారణంగా మూడు రోజులుగా పనులు నిలిచిపోయాయి. పూడికతీత పనులకు ప్రజలు సహకరించాలి. డ్రెయినేజీ వెంట ఉన్న వ్యాపారస్తులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

– మహేశ్వరరావు, జీఎమ్మార్ సంస్థ ప్రతినిధి

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు



బషీర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య అన్నారు. మండలంలోని బేతవోలు గ్రామంలో గల ఎస్‌బీఐ బ్యాంక్‌లో గత 23 ఏళ్లుగా పనిచేసి బదిలీపై కోదాడ బ్రాంచ్‌కు వెళ్లిన బషీర్‌కు శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమని అన్నారు. బ్యాంక్‌లో బషీర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బషీర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వట్టికూటి చంద్రకళ నాగయ్య, కమతం కొండలు, ఉప సర్పంచ్ బిట్టు అంతయ్య, బ్యాంక్ మేనేజర్ షేక్ సుబానీ, రెమిడాల ఆనందరావు, బాదె లింగయ్య, డీవీ ప్రసాద్ గుప్తా, బ్యాంక్ సిబ్బంది కార్తిక్, ఉమా మహేష్, వెంకన్నబాబు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, మామిడి తోరణాలంకరణ, స్వామివారికి మన్యుసూక్తంతో అభిషేకం, ఆకుపూజ, తదుపరి ఆరగింపు, మంగళాశాసనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాతులూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ చీకూరి రాజారావు, ధర్మకర్తలు వెంకటేశ్వర్లు, సైదయ్య, రాఘవయ్య, సైదమ్మ, గోపాలకృష్ణ, సుందరయ్య, వెంకటేశ్వరరావు, సోమయ్య, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నడిగూడెం : వీరకుమారి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



మునగాల : ఉపేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్ భార్య వీరకుమారి (30) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం వీరకుమారి మృతదేహానికి కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి.. వీరకుమారి మృతదేహానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల నాగరాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, మాజీ చైర్మన్ దేవబత్తిని సురేష్ ప్రసాద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఉపేందర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

మునగాల : మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు నెమ్మాది ఉపేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ శుక్రవారం ఉపేందర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామన్నారు. అనంతరం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి అజయ్‌కుమార్, నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి



ఉపాధి హామీ కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు

చిలుకూరు : ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం చిలుకూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించాలన్నారు. గ్రామాల్లో కూలీలందరికీ పనులు కల్పించాలని, పనులు జరిగే చోట సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెమిడాల జయసుధ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని ఎత్తివేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 30న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వామపక్షాల సహకారంతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఉపాధి కూలీలకు సక్రమంగా పనులు, వేతనాలు, అందజేయకుండా ఇబ్బదులకు గురి చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ కేంద్రాలలో కూడా వేలాదిగా ఉన్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహబూబ్ అలీ, కోటిరెడ్డి తదితరులున్నారు.

రజతోత్సవాలకు ముస్తాబు



గుంటి రఘునాథ అభయాంజనేయస్వామి ఆలయం

కోదాడఅర్బన్ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఉన్న శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ రజతోత్సవ వేడుకలను ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, ఆలయ ఈఓ తుమ్మల వెంకటచలపతి శుక్రవారం తెలిపారు. స్వామివారిని ప్రతిష్ఠించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఆరాధన, విశ్వక్సేనసేవ, రక్షాభందన కార్యక్రమం, పంచామృతాలతో పాటు సింధూరంతో అభిషేకాలు, పుష్పాలంకరణ, ఆకుపూజ, అష్టోత్తర సహస్రనామ పూజలు, వడమాల సమర్పణ, విష్ణుసహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి మహార్నివేదన, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి రజతోత్సవ ఉత్సవాలకు విజయవంతం చేయాలని కోరారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరుపేదలు, నాయకులు

మోతె : అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, అప్పన్నగూడెం గ్రామ నిరుపేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అప్పన్నగూడెం గ్రామంలో అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఉందని ఆరోపించారు. కొందరు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇళ్లు ఇచ్చారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి అప్పన్నగూడెం డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిగి అర్హులైన వారిని గుర్తించి ఇళ్లు కేటాయించాలన్నారు. ఈమేరకు తహసీల్దార్ పి.యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎర్రబోయిన లింగయ్య, ముత్తయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం



హుజూర్‌నగర్ : కేక్ కట్ చేస్తున్న వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తదితరులు



నేరేడుచర్ల : నర్సులను సన్మానించిన వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఎం.పుష్పావతి, వై.స్వాతి, ఎం.యశోద, ఎం.రేణుక, ఎం.మమతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసవి, వనితి క్లబ్‌ల సభ్యులు మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసి వ్యాధుల నివారణకు నర్సులు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బస్తీ దవాఖానా డాక్టర్ బండి వంశీకృష్ణ, వాసవి క్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ రాచకొండ శ్రీనివాస్‌రావు, ఆయా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, పాలిశెట్టి సంధ్య, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, కందికొండ శ్రీనివాస్‌రావు, జూలూరు అశోక్ తదితరులున్నారు.

రోగులను కాపాడే దేవతలు నర్సులు

హుజూర్‌నగర్ : రోగులను కాపాడే దేవతలు నర్సులని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇందిరాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మే 12 ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవాన్ని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. రోగులు హాస్పిటల్లో చేరినప్పటి నుంచి కోలుకొని ఇంటికి వెళ్లేవరకు వెన్నంటి సేవ చేసే సేవామూర్తులు నర్సులని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతకుమారి, లక్ష్మి, వినోద, మాధవి, స్వాతి, నవీన్, ఆశిక్, భూపాల్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



సీత్లాతండాలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్



నడిగూడెం : సిరిపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి

చిలుకూరు : గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎమ్‌హెచ్ఓ నిరంజన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీత్లాతండా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ మంగమ్మ సైదులు, ఉపసర్పంచ్ శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ కార్యదర్శి ధర్మయ్యగౌడ్, డాక్టర్ నాజియా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ధనియా, సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రెండో విడత కంటి వెలుగు పథకాన్ని సద్వియోగం చేసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, ఎంపీటీసీ సభ్యురాలు శెట్టి జ్యోతి, ఉప సర్పంచ్ శెట్టి సతీష్, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలపై సన్నాహక సమావేశం



నడిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : మండల కేంద్రంలో ఈ నెల 15 నుంచి 17వరకు నిర్వహించనున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 నుంచి 36 సంవత్సరాల లోపు యువతీయువకులు ఈ క్రీడల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయికి పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్ఐ ఏడుకొండలు, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, పీఈటీలు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

మేళ్లచెరువు : మండల కేంద్రంలో ఈ నెల 15 తేదీ నుంచి నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ పద్మ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ టోర్నమెంట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 15 నుంచి 36 సంవత్సరాల లోపు క్రీడాకారులకు క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంఈఓ సైదానాయక్, ఎంఆర్ఐ వాసుదేవరావు, ఏఎస్ఐ ఆనంద్ నాయక్, ఏపీఓ శైలజ పాల్గొన్నారు.

'పీఎంశ్రీ'కి ఎంపిక.. అభివృద్ధే ఇక

- పీఎంశ్రీ పథకానికి ఎంపికైన టీఎస్ మోడల్ స్కూల్
- త్వరలో పాఠశాలలో సమకూరనున్న మౌలిక వసతులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు



మఠంపల్లి సమీపంలోని టీఎస్ మోడల్ స్కూల్

మఠంపల్లి : ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి మండల కేంద్రానికి సమీపంలో గల తెలంగాణ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) ఈ ఏడాది ఎంపికైంది. మౌలిక వసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని 543 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఎంపిక చేయగా, సూర్యాపేట జిల్లాలో ఎంపికైన 12 పాఠశాలల్లో మఠంపల్లి పాఠశాల ఒకటిగా ఉంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అరుదైన అవకాశం..

కాగా, ఈ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతి వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే సుమారు 250 మంది విద్యార్థులు కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అయితే కళాశాలలో సుమారు 100 మంది వరకు గల విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కలదు. ఈ పాఠశాలలో మండలంలోని విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నియామకాలు చేపడతారు. మిగిలిన సీట్లను ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు కేటాయిస్తారు. ముందుగా ఆన్‌లైన్‌లో ఎంపిక విధానం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలితే ఆఫ్‌లైన్‌లో నియామకాలు చేపడతారు. ప్రతిఏటా మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధిస్తున్నారు. అత్యధికంగా గిరిజనతండాలు గల మండలంలోని మోడల్ స్కూల్ అభివృద్ధికి అరుదైన అవకాశం రావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కల్పించేది ఇలా..

పీఎం శ్రీ పథకానికి ఎంపికైన స్థానిక మోడల్ స్కూల్‌లో మెరుగైన వసతులు కల్పించనున్నారు. ఈ పథకానికి ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయాల నిధులు అందించనుంది. వాటితో సౌర విద్యుత్ ఏర్పాటు, నూతన భవనాలు, మరుగుదొడ్లు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, మినరల్ వాటర్ ప్లాంటు, కూరగాయల తోట, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ (ఐసీటీ) ల్యాబ్, క్రీడా ప్రాంగణం, అంతర్జాల సదుపాయం, డిజిటల్ గ్రంథాలయం, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, వృత్తి విద్యా కోర్సులు, నైపుణ్యాభివృద్ధి వాటికి ఈ నిధులు వాడుకోవచ్చని కేంద్రం పేర్కొంది. స్కూల్ దశ నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు. దీంతో విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది.

ఆనందంగా ఉంది

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి మా స్కూల్ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. దీంతో ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభంకాగానే పాఠశాలలో మౌలిక సదుపాయాల పనులు ప్రారంభమవుతాయి. ఈమేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– సాయిఈశ్వరి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్